సందడిగా లాల్ దర్వాజ బోనాలు

- పట్టు వస్త్రాలు సమర్పించిన ఉప ముఖ్యమంత్రి భట్టి, మంత్రి పొన్నం
- ఆకట్టుకున్న పోతురాజుల విన్యాసాలు, శివసత్తుల పూనకాలు
- పోలీసుల పటిష్ట బందోబస్తు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మహానగరంలో బోనాల ఉత్సవాలు అట్టహాసంగా జరిగాయి. ఆదివారం నగరవ్యాప్తంగా ఆషాఢ మాసపు బోనాలు వైభవోపేతంగా జరిగాయి. లాల్ దర్వాజా సింహవాహిని మహంకాళి అమ్మవారిని దర్శించుకునేందుకు ఉదయం నుంచే భక్తులు క్యూ కట్టారు. వివిధ ప్రాంతాల నుంచి వేల సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. దాంతో ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది. అమ్మవారికి మహిళలు.. భక్తిశ్రద్ధలతో బోనాలు సమర్పించారు. బోనాలు తీసుకువచ్చే మహిళల కోసం ఆలయ నిర్వహకులు ప్రత్యేక క్యూ లైన్ ఏర్పాటు చేశారు. అలాగే నగరంలోని అమ్మవార్ల ఆలయాల్లో భక్తులు ఉదయం నుంచే పూజలు, బోనాలు సమర్పించారు. మహిళలు, వృద్ధులు, పిల్లలతో దేవాలయాలు సందడిగా మారాయి. పోతురాజుల విన్యాసాలు, డప్పుల చప్పులతో అమ్మవార్లకు భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. సాయంత్రం నుంచి ఫలహార బండ్లు ఊరేగింపుగా తీసుకువచ్చి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. మహంకాళి అమ్మవారికి రాష్ట్ర ప్రభుత్వం తరపున డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి పొన్నం ప్రభాకర్ పట్టువస్త్రాలు సమర్పించారు. భారీ స్థాయిలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

దేవాలయాల అభివృద్ధికి 1290 కోట్లు
డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క

పాతబస్తీలోని లాల్ దర్వాజ సింహవాహిని మహంకాళి అమ్మవారిని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, సహచర మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలతో కలసి సందర్శించుకున్నారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం ప్రభుత్వం తరపున పట్టువస్త్రాలు సమర్పించి.. ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకుముందు ఆయన్ను ఆలయ మర్యాదలతో అర్చకులు, కమిటీ సభ్యులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఉపముఖ్యమంత్రి మాట్లాడుతూ.. ప్రభుత్వం దేవాలయ పునరుద్ధరణ పనులకు రూ.1290 కోట్లు కేటాయించిందన్నారు. బోనాలను వైభవోపేతంగా నిర్వహించుకునేందుకు ప్రభుత్వం రూ. 20 కోట్లు నిధులు మంజూరు చేసిందని తెలిపారు. భవిష్యత్తులోనూ జరిగే బోనాల జాతరలను ఇంకా మెరుగైన రీతిలో చేపట్టడం కోసం ఈ ప్రాంత అభివృద్ధితో పాటు సింహవాహిని మహంకాళి దేవాలయ అభివృద్ధికీ ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.

ఆలయాన్ని సందర్శిస్తున్న ఉప ముఖ్యమంత్రి భట్టి, మంత్రి పొన్నం

గతనెల 26న నగరంలో ప్రారంభమైన బోనాల నుంచి ఇప్పటివరకు ఎక్కడా ఎలాంటి సంఘటనలు ఉత్పన్నం కాకుండా సంబంధిత శాఖ అధికారులు నిబద్ధత, బాధ్యతాయుతంగా విధులు నిర్వహిస్తున్నారని అన్నారు. ఈ సందర్భంగా అధికారుల్ని డిప్యూటీ సీఎం అభినందించారు. రాష్ట్రం సుభిక్షంగా ఉండేలా అమ్మవారి ఆశీస్సులు అందరిపై ఉండాలని కోరుకున్నట్టు తెలిపారు. రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లేందుకు ఒక విజన్‌తో రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తుందన్నారు. నెలరోజుల బోనాల్లో తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలు ఉట్టిపడేలా అనేక కళా ప్రదర్శనలు చేపట్టామనీ, ప్రతి భక్తునికి అన్ని ఏర్పాట్లు చేశామని చెప్పారు. అనంతరం మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి డిప్యూటీ సీఎం చార్మినార్ భాగ్యలక్ష్మి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

సింహవాహిని అమ్మవారిని దర్శించుకున్న ప్రముఖులు..

హైకోర్టు జడ్జి ఎస్.నంద మహంకాళి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవాదాయ శాఖ అధికారులు, అర్చకులు, కమిటీ సభ్యులు ఆలయ మర్యాదలతో ఆయనకు స్వాగతం పలికారు. అమ్మవారిని దర్శించుకున్న వారిలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్, మంత్రులు అడ్లూరి లక్ష్మణ్ కుమార్, వాకాటి శ్రీహరి, ఎంపీలు చామల కిరణ్ కుమార్ రెడ్డి, అనిల్ కుమార్ యాదవ్, శాసనమండలి వైస్ చైర్మెన్ బండా ప్రకాష్, టీపీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్, ఎమ్మెల్సీ కవిత, ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్, ఫైనాన్స్ కమిషన్ చైర్మెన్ సిరిసిల్ల రాజయ్య, పిషరీస్ చైర్మెన్ మెట్టు సాయికుమార్, మేయర్ గద్వాల విజయలక్ష్మి, మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, టీటీడీ చైర్మెన్ బీఆర్ నాయుడు, మాజీ ఎంపీ అంజన్ కుమార్ యాదవ్, దేవాదాయ శాఖ కమిషనర్ ఎస్. వెంకట్రావు, జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి, వివిధ కార్పొరేషన్ల చైర్మెన్లు, పోలీస్ అధికారులు, భక్తులు తదితరులు ఉన్నారు.

భాగ్యలక్ష్మి అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించిన మంత్రులు

చార్మినార్ భాగ్యలక్ష్మి అమ్మవారిని మంత్రులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వం తరపున అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే భాగ్యలక్ష్మి అమ్మవారిని పలువురుప్రజాప్రతినిధులు,ప్రముఖులు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రజలకు శక్తిని, ధైర్యాన్ని ఇవ్వాలని భాగ్యలక్ష్మి అమ్మవారిని కోరుకున్నాననీ, ప్రమాదాలు జరగకుండా అమ్మవారి ఆశీస్సులు ఉండాలన్నారు. సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి బోనాలు, బల్కంపేట ఎల్లమ్మ తల్లి కళ్యాణం, గోల్కొండ జగదాంబిక అమ్మవారి బోనాలు ఘనంగా నిర్వహించామని తెలిపారు. అమ్మవారి ఆశీర్వాదంతో మంచి వర్షాలు, పాడిపంటలతో ప్రజలంతా ఆయురారోగ్యాలతో ఉండాలన్నారు.

వరంగల్‌లో క్రికెట్ స్టేడియం నిర్మాణానికి చర్యలు తీసుకోండి

- సిఎంకు ఆ జిల్లా ఎమ్మెల్యేల వినతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వరంగల్‌లో అంతర్జాతీయ స్థాయి క్రికెట్ స్టేడియం నిర్మించాలంటూ ఆ జిల్లాకు చెందిన కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కోరారు. ఆదివారం హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని సిఎం నివాసంలో ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, రేవూరి ప్రకాష్‌రెడ్డి, నాయిని రాజేందర్ రెడ్డి, మామిడాల యశస్వినిరెడ్డి, కేఆర్ నాగరాజు తదితరులు కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు మాట్లాడుతూ రాష్ట్రంలో యువతకు నాణ్యమైన విద్య, క్రీడా ప్రోత్సాహం అందించడంలో ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల పట్ల సంతృప్తిని వ్యక్తం చేశారు. ఇప్పటికే ఈ జిల్లా నుంచి అనేక మంది క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రాతినిధ్యం వహించారని గుర్తు చేశారు. అర్జున, ద్రోణాచార్య అవార్డులు కూడా పొందారని తెలిపారు. ప్రస్తుతం వరంగల్‌లో జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియం మాత్రమే ఉందనీ, ప్రస్తుత పరిస్థితుల్లో ఆ స్టేడియం క్రీడాకారుల అవసరాలను తీర్చలేకపోతుందని వివరించారు. అందువల్ల హన్మకొండ జిల్లాలో తెలంగాణ క్రీడా పాఠశాల ఏర్పాటుతోపాటు, ప్రత్యేకంగా క్రికెట్ స్టేడియం నిర్మించాల్సిన అవసరం ఉందని కోరారు. ధర్మసాగర్ మండలం ఉన్నికిచెర్ల గ్రామంలో ఇందుకు అవసరమైన 30 ఎకరాల కుడా భూమి ఉందని తెలిపారు. విద్యా, వైద్య, ఇంజనీరింగ్, నిట్, కాకతీయ యూనివర్సిటీ వంటి ప్రఖ్యాత విద్యా కేంద్రాలు కూడా ఉన్నాయని చెప్పారు. ఎమ్మెల్యేల విజ్ఞప్తిపై సిఎం రేవంత్‌రెడ్డి సానుకూలంగా స్పందించారు. తక్షణమే సంబంధిత శాఖ సెక్రటరీతో ఫోన్‌లో మాట్లాడి, వరంగల్‌లో క్రీడా పాఠశాల, క్రికెట్ స్టేడియం ఏర్పాటు ప్రతిపాదనలను పరిశీలించి తగిన విధివిధానాలను రూపొందించాలని ఆదేశించారు. వరంగల్ అభివృద్ధికి పూర్తి సహకారం అందిస్తాననీ, త్వరలోనే క్రీడా పాఠశాల, క్రికెట్ స్టేడియం మంజూరు చేసేందుకు చర్యలు తీసుకుంటానని సిఎం హామీ ఇచ్చారు.

ప్రజలకు బోనాలు శుభాకాంక్షలు

- గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర ప్రజలకు గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. తెలంగాణ సంప్రదాయ పండుగ బోనాలు ఇక్కడి ప్రత్యేక సంస్కృతిని ప్రతిబింబిస్తుందని తెలిపారు. పర్యావరణాన్ని, ప్రకృతిని పూజిస్తారని తెలిపారు. ఎల్లమ్మ (మహంకాళి మాత) ప్రజలకు మంచి ఆరోగ్యాన్ని, శాంతిని ప్రసాదించాలని గవర్నర్ ఆకాంక్షించారు.

ఎన్‌హెచ్‌ఎంలో సర్వీసుల పొడిగింపు

- ఉత్తర్వులు జారీ

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్‌ఎం)లో మరో ఏడాది కోసం సర్వీసులను పొడిగించారు. ఈ మేరకు వైద్యారోగ్యశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. మిషన్ పరిధిలో పని చేస్తున్న 51,451 మంది కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సేవలు ఈ ఏడాది మార్చితో ముగిశాయి. అయితే గత మూడు నెలల నుంచి సర్వీసు పొడిగింపు ఉత్తర్వులు జారీ చేయలేదు. తాజాగా వారి సర్వీసులను 2026 మార్చి వరకు ప్రభుత్వం పొడిగించింది. వీరితో పాటు పీఎం అభిమ్ పథకం కింద 1,500 మందిని ఎన్ హెచ్‌ఎం కింద పలు పథకాల్లో పని చేసే మరో 1,760 మందిని కూడా మరో ఏడాది వరకు కొనసాగించనున్నది.

పంచాయతీరాజ్ శాఖ ఇన్‌ఛార్జి ఇఎన్సీగా అశోక్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పంచాయతీ శాఖ ఇంజనీరింగ్ విభాగం ఇన్‌ఛార్జి ఇఎన్సీగా ఎన్. అశోక్‌ను రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. ఆదివారం హైదరాబాద్‌లోని మంత్రి సీతక్క నివాసంలో కలిసి ఆయన ధన్యవాదాలు తెలిపారు. గ్రామీణ రహదారులు, భవనాలు, మౌలిక వసతుల కల్పనలో ప్రజా ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా పనులు వేగంగా పూర్తి చేయాలని ఈ సందర్భంగా సీతక్క ఈఎన్‌సీకి సూచించారు.

రేపటి కోసం రేవంత్ వ్యూహాత్మకంగా అడుగులు

- కీలక నిర్ణయాలతో ప్రక్షాళనకు శ్రీకారం
- మంత్రివర్గం నుంచి జూపల్లి ఔట్... ప్రేమ్‌సాగర్‌రావు ఇన్...
- జూబ్లీహిల్స్ నుంచి దానం పోటీ.. గెలిస్తే మంత్రి పదవి
- మంత్రుల శాఖల మార్పు... మిగిలిన మూడు భర్తీ
- జడ్చర్లలో కీలక నేతల రహస్య భేటీ

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

రేపటి కోసం రేవంత్. తిరిగి ఆయనే ముఖ్యమంత్రి. కాంగ్రెస్ పార్టీలో ఇప్పుడు ఇలాంటి వ్యాఖ్యలే వినిపిస్తున్నాయి. అందుకు బలం చేకూరేలా రేవంత్ వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నట్టు తాజా పరిణామాలు రూఢీ చేస్తున్నాయి. రేవంత్‌రెడ్డి నమ్మకస్తులైన కీలక నేతలు కొల్లాపూర్ బహిరంగ సభ ముగించుకుని జడ్చర్ల పట్టణంలో ఓ ప్రజాప్రతినిధి ఫామ్‌హౌస్‌లో రహస్యంగా భేటీ అయినట్టు విశ్వసనీయ సమాచారం. పార్టీలో నెలకొన్న అంతర్గత పరిస్థితులు, రాజకీయ పరిణామాలు తదితరాంశాలపై చర్చించినట్టు తెలిసింది. వాటిని సీఎం రేవంత్‌రెడ్డికు షేర్ చేయనున్నారు. ఆ సమావేశంలో చర్చకు వచ్చిన కీలకాంశాలు విస్తుగొల్పేలా ఉన్నాయి. ఎన్నో చిక్కులను ఛేధించుకుంటూ...పార్టీ, ప్రభుత్వంపై పట్టు సాధించుకుంటూ వస్తున్న రేవంత్‌రెడ్డి...భవిష్యత్తుకు బంగారు బాటలు వేయాలని భావిస్తున్నారు. పార్టీ, ప్రభుత్వం ప్రవాహానికి అడ్డంకిగా ఉన్న పలు సమస్యలను తొలగించే పనిలో పడ్డారు. వచ్చే ఎన్నికల లోపు నియోజకవర్గాల పునిర్వభజన జరిగితే...119 సీట్లు ఉన్న తెలంగాణాలో ఆ తర్వాత 150కి పెరుగుతాయని రేవంత్ చెబుతున్న విషయం తెలిసిందే. అప్పుడు కాంగ్రెస్ పార్టీకి వంద సీట్లు వస్తాయని ధీమా వ్యక్తం చేస్తున్నారు. అందులో ఒకటి తగ్గినా కాళ్ల పట్టుకుని క్షమాపణ చెబుతానంటూ బహిరంగంగానే చెప్పారు. ఆ లక్ష్యాలను సాధించేందుకు ఆయన దూరదృష్టితో ముందుకు సాగుతున్నారు. అందులో భాగంగా ప్రభుత్వంలో కీలక నిర్ణయాలు తీసుకోబోతున్నారు.

'గ్రేటర్'పై పట్టు కోసం

హైదరాబాద్‌లో బలహీనంగా ఉన్న పార్టీకి పూర్వవైభవం తీసుకొచ్చేందుకు ఎమ్మెల్యే దానం నాగేందర్‌ను రంగంలోకి దించాలని భావిస్తున్నారు. బీఆర్ఎస్ బీఫామ్‌పై గెలిచిన ఆయన... కాంగ్రెస్ బీఫామ్‌పై ఎంపీగా పోటీ చేశారు. దీంతో ఆయన ఎమ్మెల్యే సభ్యత్వాన్ని రద్దు చేయాలని బీఆర్ఎస్ శాసనసభాపతికి ఫిర్యాదు చేసింది. ఇప్పుడు ఆయన సభ్యత్వం రద్దైనా కావాలి...లేదా ఆయన రాజీనామానైనా చేయాలి. అంతేగానీ ఆయనకు వేరే గత్యంతరం లేదు. పార్టీ మాత్రం ఆయన్ను రాజీనామా చేయించి జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల బరిలోకి దించాలని భావిస్తున్నది. గెలిచిన తర్వాత కాపు సామాజిక తరగతికి చెందిన ఆయనకు మంత్రి పదవి ఇచ్చి ఆ వర్గాన్ని ఆకర్షించాలని యోచిస్తున్నది. తద్వారా గ్రేటర్ హైదరాబాద్‌పై పట్టు సాధించాలని భావిస్తున్నది. ఆ దృష్టితోనే టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షులు జగ్గారెడ్డికి గ్రేటర్ ఇన్‌చార్జి బాధ్యతలను అప్పగించింది. గ్రేటర్ హైదరాబాద్ కార్పొరేషన్ ఎన్నికల్లో తమ సత్తా చాటితేనే, అసెంబ్లీ ఎన్నికల్లో ఖాతా తెరుస్తామన్న ఆలోచనలో ఉన్నారు. అందుకే జగ్గారెడ్డిని కూడా సీఎం రేవంత్‌రెడ్డి రంగంలోకి దించారనేది టాక్. ఆయన కూడా రేవంత్‌పై ఈగ వాలకుండా బీఆర్ఎస్, బీజేపీ నేతల విమర్శలను తిప్పికొడుతున్నారు. రానున్న ఎన్నికల్లో సంగారెడ్డి నుంచి ఆయన పోటీకి దూరంగా ఉంటూ తన భార్య నిర్మలకు టికెట్ ఇప్పించుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. అంతలోపు తనకు మంత్రి పదవి లేదా ఎన్నికలకు రెండేండ్ల ముందు తనకు పీసీసీ అధ్యక్ష పదవిని ఆశిస్తున్నట్టు తెలిసింది.

మిగిలిన మంత్రుల భర్తీ

మంత్రివర్గంలో మూడు బెర్తులు ఖాళీగా ఉండటంతో జగ్గారెడ్డితోపాటు పి.సుదర్శన్‌రెడ్డి, పరిగి రామ్మోహన్‌రెడ్డి మంత్రి పదవి వస్తున్నదన్న నమ్మకంతో ఉన్నారు. మిగిలిన మూడు బెర్తులను భర్తీకి రేవంత్ రెడీగా ఉన్నారు. దీనికి అధిష్టానం గ్రీన్ సిగ్నల్ ఇవ్వగానే ఆ ప్రక్రియను పూర్తి చేయాలని భావిస్తున్నారు. కొంత కాలంగా మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన మంత్రి జూపల్లి కృష్ణారావును ఆ పదవి నుంచి తొలగించి, అదే సామాజిక తరగతికి చెందిన నిర్మల్ ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావుకు అప్పజెపేందుకు సీఎం రెడీ అవుతున్నట్టు తెలిసింది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఒకే కుటుంబానికి మంత్రి, ఎంపీ, ఎమ్మెల్యే అన్న ఆపవాదును తొలగించుకునేందుకు ఆయనకు మంత్రి ఇవ్వకతప్పని పరిస్థితి. ఈ క్రమంలోనే మంత్రులు శాఖలను మార్చాలని భావిస్తున్నట్టు తెలిసింది. కొంత మంది మంత్రులకు ఎక్కువ శాఖలు ఉండటం వల్ల వారిపై పని భారం పడుతుంది. వారికున్న శాఖలు నచ్చకపోవడం, వాటిపై వారు పట్టు సాధించకపోవడం, వారి నుంచి కొన్ని శాఖలను తీసి, కొత్త వారికి అప్పగించడం...తద్వారా సీఎం తన టీమ్‌ను సిద్ధం చేసుకోనున్నారు. కొంత మంది మంత్రులు ప్రభుత్వ కార్యకలాపాలకు మాత్రమే పరిమితమవుతున్నారు. పార్టీని పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. వీటిన్నింటిని సరిదిద్దడం ద్వారా పార్టీపైనా, ప్రభుత్వంపైనా సీఎం తన మార్క్ చూపించనున్నారు. సీఎం తన కార్యాచరణను అమలు చేసేందుకు అన్ని విధాల సిద్ధమవుతున్నారు. ఈ విషయంలో అధిష్టానంతో సంప్రదింపులు జరుపుతూనే రేపటి కోసం ఆయన పక్కా ప్రణాళికతో ముందుకు సాగాలని బలమైన నిర్ణయం తీసుకున్నట్టు విశ్వసనీయ సమాచారం.

పాసుపుస్తకాల కోసం ఎదురుచూపు

- ఎనిమిది నెలలుగా తీవ్ర జాప్యం

హైదరాబాద్ బ్యూరో : సాగు భూముల కొనుగోళ్ల అనంతరం జారీ కావాల్సిన పట్టాదారు పాసుపుస్తకాలు సకాలంలో అందడం లేదు. తహసీల్దార్- సంయుక్త సబ్ రిజిస్ట్రార్ వద్ద భూమి రిజిస్ట్రేషన్ చేసుకున్నాక.. కొనుగోలుదారుకు అధికారికంగా డిజిటల్ సంతకంతో డాక్యుమెంట్ అందజేస్తారు. తపాలాశాఖ ద్వారా రైతులకు పాసుపుస్తకాలు చేరతాయి. ఈ ప్రక్రియలో ఎనిమిది నెలల నుంచి జాప్యం జరుగుతోంది. రెవెన్యూశాఖ నుంచి పుస్తకాల ముద్రణకు గంపగుత్తగా ఆర్డర్లు ఇస్తున్నారు. ముద్రణ సంస్థ పుస్తకాలు అచ్చువేసి తపాలాశాఖ ద్వారా పంపుతున్నారు. వీటి కోసం గతేడాది సెప్టెంబరు నుంచి ఎదురుచూస్తున్న వారు పెద్దఎత్తున ఉన్నారు. భూమి రిజిస్ట్రేషన్, పాసుపుస్తకం జారీకి సంబంధించిన అంశం తహసీల్దారు కార్యాలయం పరిధిలో ఉండదు. అయినప్పటికీ, బాధితులు పాసుపుస్తకాలు ఏమయ్యాయంటూ తహసీల్దార్ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. ఇటీవల నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లోనూ కరీంనగర్, నల్గొండ, భద్రాద్రి కొత్తగూడెం తదితర జిల్లాల నుంచి రెవెన్యూశాఖకు దరఖాస్తులు అందాయి. ధరణి పోర్టల్ భూ భారతి పోర్టల్‌గా మారినా పాసు పుస్తకాలకు సంబంధించి ప్రత్యేకంగా మార్పులేవీ రాలేదు. పుస్తకాల పంపిణీకి ట్రాకింగ్ వ్యవస్థను ఏర్పాటు చేయాలన్న విజ్ఞప్తులున్నాయి. మరోవైపు ముద్రణ సంస్థలకు, రెవెన్యూశాఖకు సమన్వయం కుదరడం లేదని తెలుస్తోంది. దీంతో కొన్ని రోజులు చెన్నైలోని సంస్థతో ముద్రణ చేయించగా ఆ తరువాత మరో సంస్థతో చేయించినట్లు సమాచారం. పాసుపుస్తకం లేనిది రైతు భరోసా, బీమాలకు దరఖాస్తులను పరిగణనలోకి తీసుకోలేమని మండల స్థాయిలో వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నట్లు రైతులు పేర్కొంటున్నారు.

హైదరాబాద్‌కు అందరికీ ఆహ్వానం

- సిఎం రేవంత్ రెడ్డి ట్వీట్
- పలు భాషల్లో స్వాగతం చెబుతూ తెలంగాణ మ్యాప్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

జాతీయ భాషపై దేశవ్యాప్తంగా చర్చ జరుగుతున్న సమయంలో 'మా రాష్ట్రం అందరినీ ఆహ్వానిస్తోంది' అని సిఎం రేవంత్ రెడ్డి ట్వీట్ ఆదివారం ట్వీట్ చేశారు. మహారాష్ట్రలో మరాఠీ, కర్ణాటకలో కన్నడ, తమిళనాడులో తమిళం నేర్చుకోవాలని ఆయా ప్రాంతాల్లో ఇతర భాషలు మాట్లాడే వారిపై ఆందోళనకు జరుగుతున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో తాజాగా తెలంగాణ రైజింగ్-2047 పేరుతో వివిధ భాషల లిపితో కూడిన తెలంగాణ మ్యాప్ ఫోటో నెట్టింట వైరల్‌గా మారింది. అందులో తెలుగు హిందీ, ఇంగ్లీష్, ఉర్దూ, తమిళం, కన్నడ, ఫ్రెంచ్, స్పానిష్, జపనీస్ వంటి వివిధ దేశాలలోని భాషలతో 'స్వాగతం' అని రాసి ఉంది. 'హైదరాబాద్ అందరినీ ఆహ్వానిస్తోంది' అని పోస్టర్ టైటిల్‌తో పాటు తెలంగాణ రైజింగ్ -2047 లోగో, సిఎం రేవంత్ రెడ్డి ఫోటోతో పోస్టర్ విడుదల అయింది. పెట్టుబడులు, వ్యాపారం, జాబ్, చదువు, స్థిరపడ్డానికి, పర్యాటకానికి హైదరాబాద్‌కి రావొచ్చని ఆ పోస్టర్‌లో పేర్కొన్నారు. అలాగే 'మీరు ఏ భాష మాట్లాడినా, ఏ దుస్తులు ధరించినా, ఎవరితో నివసిస్తున్నా, మీరు నమ్మే విశ్వాసం ఏదైనా.. కూడా హైదరాబాద్ మిమ్మల్ని స్వాగతిస్తోంది' అని పేర్కొన్నారు. భాష పేరుతో రాజకీయాలు జరుగుతున్న సమయంలో తెలంగాణ సిఎం పోస్ట్ ఉత్తేజకరంగా ఉందని అంకిత్ కుమార్ అవస్థి అనే యూజర్ సిఎం ట్వీట్‌కు స్పందించారు. దీంతో రేవంత్ రెడ్డి, అంకిత్ పోస్ట్‌కు రీట్వీట్ చేస్తూ కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణ, హైదరాబాద్ ఎల్లప్పుడూ దేశమే కాదు.... ప్రపంచంలోని ప్రతి ప్రాంతం నుంచి వచ్చిన ప్రజలందరినీ స్వాగతించడానికి సిద్ధంగా ఉందని సిఎం పేర్కొన్నారు.

గాయకుడు రాహుల్ సిప్లిగంజ్‌కు రూ.కోటి నజరానా

- సిఎం రేవంత్ రెడ్డి

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

'ఆస్కార్' అవార్డు గ్రహీత, గాయకుడు రాహుల్ సిప్లిగంజ్‌కు తెలంగాణ ప్రభుత్వం రూ.ఒక కోటి నజరానా ప్రకటించింది. ఎన్నికలకు ముందు రాహుల్ సిప్లిగంజ్‌కు రేవంత్ రెడ్డి రూ. పది లక్షల ఆర్థిక సాయం ప్రకటించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే రూ.ఒక కోటి అందిస్తామని హామీ ఇచ్చారు. ఆ హామీ మేరకు హైదరాబాద్ పాతబస్తీ బోనాల సందర్భంగా తాజా నజరానా ప్రకటించారు. స్వయం కృషితో ఎదిగిన రాహుల్ సిప్లిగంజ్ యువతకు ఆదర్శమని ఈ సందర్భంగా సిఎం అన్నారు. ఓల్డ్ సిటీ నుంచి 'ఆస్కార్' వరకూ వెళ్లిన కుర్రాడంటూ రాహుల్‌ను 'గద్దర్' అవార్డుల ప్రదానోత్సవ వేడుకలో సిఎం రేవంత్ కొనియాడిన విషయం తెలిసిందే. ప్రస్తుతానికి అతనికి 'గద్దర్' పురస్కారం దక్కలేదని, అతని ప్రతిభకు తగ్గ అవార్డుగాని, మరో ప్రోత్సాహకంగానీ ఇవ్వాలని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్కకు సూచించారు. 'కాలేజ్ బుల్లోడా', 'వాస్తు బాగుందే', 'రంగా రంగా రంగస్థలానా', 'బొమ్మోలే ఉన్నదిరా పోరి', 'నాటు నాటు' వంటి సినిమా పాటలు, 'ఓ నా రాహులా', బోనాలు, వినాయక చవితి తదితర స్పెషల్ సాంగ్స్‌తో రాహుల్ శ్రోతలను అలరించారు. 'రంగమార్తాండ'తో నటుడిగానూ ఆకట్టుకున్నారు.

బోనాల ఉత్సవాలు విజయవంతం

- అధికారులకు సిఎం రేవంత్‌రెడ్డి అభినందనలు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

చారిత్రాత్మక గోల్కొండ కోటలో వెలసిన జగదాంబిక ఎల్లమ్మ తల్లికి ఆషాడ మాసం తొలి బోనం సమర్పించడంతో జంటనగరాల్లో మొదలయ్యాయని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. నెల రోజులపాటు జరిగిన బోనాల ఉత్సవాలు దేవాదాయ, ఇతర శాఖల సమన్వయం, పర్యవేక్షణతో విజయవంతం కావడం పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రజల అధ్యాత్మిక సంస్కృతికి బోనాల పండుగ ప్రతీక అని పేర్కొన్నారు. ప్రకృతితో మమేకమై జీవించే వ్యవసాయ ఆధారిత సమాజ సాంప్రదాయ, సామూహిక తాత్వికత, బోనాల పండుగ అని తెలిపారు. తెలంగాణ సాంప్రదాయానికి అద్దంపట్టే బోనాల జాతరతో రాష్ట్ర మంతటా అధ్యాత్మికత ఉట్టిపడిందని పేర్కొన్నారు. గోల్కొండలో మొదటి బోనంతో ప్రారంభమైన ఆషాఢ బోనాల జాతర లాల్ దర్వాజా సింహవాహిని అమ్మవారికి బోనం సమర్పించడంతో బోనాల ఘట్టం ముగిసిందని పేర్కొన్నారు. బోనాల ఉత్సవాలను విజయంతం కావడానికి కృషి చేసిన అన్ని శాఖల అధికారులకు, సిబ్బందికి సిఎం అభినందనలు తెలియజేశారు.

ఆర్‌టిసికి గిరాకీ

- కొత్తగా 500 బస్సుల కొనుగోలుకు ప్రణాళిక

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఆర్‌టిసి బస్సుల్లో ఆర్డినరీ, ఎక్స్‌ప్రెస్‌లకు భారీగా డిమాండు ఉంటోంది. గతంలో ఆర్‌టిసిలో సీట్ల భర్తీ నిష్పత్తి (ఆక్యుపెన్సీ రేషియో) సగటు సుమారు 67 శాతం ఉండేది. ఇప్పుడు దాదాపు 95 శాతం నమోదవుతోంది. ఆర్డినరీ, ఎక్స్‌ప్రెస్‌లలో 110 శాతం దాటుతోంది. దీంతో గ్రామాలు, పట్టణాలకు బస్సుల కోసం ఆర్‌టిసికి భారీ విజ్ఞాపనలు వస్తున్నాయి. అటు ప్రయాణికులతోపాటు ఇటు ఎమ్మెల్యేలు, మంత్రుల నుంచి కూడా పెద్దసంఖ్యలో అందుతున్నాయి. ముఖ్యంగా గ్రామాల నుంచి హైదరాబాద్‌కు బస్సులు కిక్కిరిసి వస్తున్నాయి.ఇవి బయల్దేరిన మొదటి రెండు, మూడు గ్రామాల్లోనే నిండిపోతున్నాయి. దీంతో మధ్యలో వచ్చే గ్రామాల ప్రజలకు నిల్చుని ప్రయాణించేందుకూ చోటు దొరకట్లేదు. ఈ నేపథ్యంలో ఈ ఏడాది రూ.193.44 కోట్ల వ్యయంతో 503 కొత్త బస్సుల కొనుగోలుకు ఆర్‌టిసి సిద్ధమవుతోంది. ముఖ్యంగా గ్రామీణ, పట్టణ ప్రాంతాలకు తిరిగే పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్‌లతోపాటు హైదరాబాద్, వరంగల్ నగరాల్లో నడిచే సిటీ ఆర్డినరీ, మెట్రో ఎక్స్‌ప్రెస్‌లను పెంచేందుకు ప్రాధాన్యమిస్తోంది.

తెలంగాణపై కత్తి కట్టిన మోడీ

- నిధుల నుంచి ప్రాజెక్టుల వరకు పక్షపాతం
- బిజెపి పాలిత రాష్ట్రాలకు పెద్దపీట
- సిఎం రేవంత్ వినతులు బుట్ట దాఖలు
- ప్రజల్లో పలచన చేసి రాష్ట్రంలో పాగా వేసేందుకు కుట్ర

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

కేంద్రంలోని మోడీ ప్రభుత్వం తెలంగాణపై కత్తి కట్టింది. నిధుల కేటాయింపు నుంచి వివిధ ప్రాజెక్టుల అనుమతి వరకు పాము చావకుండా...కర్ర విరగకుండా అన్నట్టు వ్యవహరిస్తోంది. బిజెపి పాలిత రాష్ట్రాలకు పెద్దపీట వేస్తున్న కేంద్రం తెలంగాణకు పట్ల పక్షపాత ధోరణిని ప్రదర్శిస్తోంది. సిఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క, మంత్రులు పలుమార్లు ప్రధాని మోడీతో సహా కేంద్ర మంత్రులను కలిసి సహాయం కోసం అభ్యర్థించినా శూన్య హస్తమే దక్కింది. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు అడుగడుగునా అడ్డంకులు సృష్టిస్తోంది. పథకాలు అగిపోయి ప్రజల్లో కాంగ్రెస్ సర్కార్ పలచన కావడం... తద్వారా రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలో పాగా వేసేందుకు కమల దళం ఇప్పటి నుంచే కుట్రలకు తెరలేపిందనే విమర్శలు వినిపిస్తున్నాయి.

భారత రాజ్యాంగ నిర్మాతలు పటిష్టమైన సమాఖ్య వ్యవస్థను ఏర్పాటు చేశారు. దీనికనుగునంగా స్పష్టమైన విధివిధానాలు, కేంద్ర, రాష్ట్రాల మధ్య అధికారాల విభజన, శాసన, పరిపాలన, ఆర్థికపరమైన సంబంధాలను పేర్కొన్నారు. జాతీయ సమైక్యత, సమగ్రతను దృష్టిలో ఉంచుకొని కేంద్ర ప్రభుత్వానికి కొన్ని ప్రత్యేక అధికారాలను రాజ్యాంగం కల్పించింది. వాటిని అడ్డం పెట్టుకుని గత పదకొండేళ్లుగా మోడీ సర్కార్ సమాఖ్య స్ఫూర్తికి తూట్లు పొడుస్తూ రాష్ట్రాల హక్కులను హరిస్తోంది. బిజెపి పాలిత రాష్ట్రాలకు నిధుల పంపకం నుంచి ప్రాజెక్టుల అనుమతి వరకు పెద్దపీట వేస్తోంది. అదే సమయంలో తెలంగాణ పట్ల మోడీ సర్కార్ అడుగడుగునా విషయం కక్కుతోంది. కేంద్ర జిడిపిలో తెలంగాణ వాటా 5శాతం ఉన్నప్పటికి ఆ స్థాయిలో నిధుల కేటాయింపులు జరగడం లేదు. చట్టబద్ధంగా రావాల్సిన నిధుల వాటా విడుదలలో జాప్యం, కొత్త ప్రాజెక్టుల అనుమతులు, ఆర్థిక సాయంలో వివక్షను ప్రదర్శిస్తోంది. ఐటిఐఆర్‌ను అటకెక్కించిన కేంద్రం, మూసీ రివర్‌ఫ్రంట్ అభివృద్ధి, రీజినల్‌రింగ్‌రోడ్ నిర్మాణంపై రాష్ట్రం చేసిన విజ్ఞప్తికి స్పందించలేదు. వెనుకబడిన జిల్లాలకు నిధులివ్వాలన్న విజ్ఞప్తిని పట్టించుకోవడం లేదు. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హెూదా పక్కన పెడితే, కనీసం అక్సిలరేటెడ్ ఇరిగేషన్ బెనిఫిట్స్ ప్రోగ్రామ్ (ఎఐబిపి) స్కీంలో కూడా పరిగణలోకి తీసుకోలేదు. సిరిసిల్లకు మెగా పవర్ లూమ్ క్లస్టర్, వరంగల్ టెక్స్ టైల్ పార్క్‌కు ఆర్థిక సాయంపై అందించలేదు. అనేక రకాలుగా తెలంగాణపై కేంద్రం వివక్ష కొనసాగిస్తోంది.

ఎనిమిది మందిని గెలిపిస్తే....

తెలంగాణ నుంచి ఎనిమిది మంది బిజెపి ఎంపిలను గెలిపించినా నరేంద్ర మోడీ ప్రభుత్వం రాష్ట్రానికి అన్నింటా అన్యాయమే చేస్తోంది. తెలంగాణ ప్రజలు అక్కున చేర్చుకుని అందలం ఎక్కిస్తే ప్రజలకు గుణ పాఠం నేర్పింది. రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న ఇద్దరు కేంద్ర మంత్రులు తమ పదవుల కోసం లాలూచి పడ్డారే తప్ప రాష్ట్ర ప్రయోజనాల గురించి పట్టించుకున్న పాపాన పోలేదు. పైగా కేంద్రం ప్రదర్శిస్తున్న వివక్షను సమర్థిస్తూ రాష్ట్రానికి తీరని ద్రోహం చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వాన్ని అడుగడుగునా ఇరుకున పెట్టడం ద్వారా రాష్ట్రంలో కాంగ్రెస్‌పై ప్రజల్లో అసంతృప్తిని ఎగదోస్తున్నారు.

కేంద్రానికి రాష్ట్రం చేసిన ముఖ్య మైన వినతులు...

1). మెట్రో రెండో దశ ప్రాజెక్టు (76.4 కిలోమీటర్ల) విస్తరణకు కేంద్రం వాటాగా రూ.17,212 కోట్లు కేటాయించాలని కోరినా రూపాయి ఇవ్వలేదు. (రూ.15,611 కోట్లతో చేపట్టిన బెంగళూరు మూడో దశకు 2024లో, రూ. 3,624 కోట్లతో చేపట్టిన పుణె రెండో దశ...2025 జూన్‌లో అనుమతించింది)

2). తుమ్మిడిహెట్టి ఎత్తిపోతల ప్రాజెక్ట్ నిర్మాణానికి తెలంగాణ ప్రభుత్వం సిద్ధంగా ఉంది. భూసేకరణ, నీటి వాటాల విషయంలో మహారాష్ట్ర ప్రభుత్వాన్ని ఒప్పించేందుకు ప్రధాని జోక్యం చేసుకోవాలి.

3). ఎన్‌టిపిసిలో 4,000 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం ఉంటే గత ప్రభుత్వం 1,600 మెగావాట్లు మాత్రమే సాధించింది. మిగిలిన 2,400 మెగావాట్ల ఉత్పత్తికి కేంద్ర సహకరించాలి. రాష్ట్ర ప్రభుత్వం తరపున అన్ని అనుమతులు ఇస్తాం.

4). మూసీ నదీ ప్రక్షాళనకు కేంద్రం రూపాయి సాయం అందించలేదు. ప్రపంచ బ్యాంక్ నుంచి కాకుండా ఆసియా అభివృద్ధి బ్యాంకు (ఎడిబి) నుంచి రూ..4,100 కోట్ల రుణం తీసుకోమ్మని కేంద్ర ఆర్థిక వ్యవహారాల శాఖ (డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎకనమిక్ ఎఫైర్స్) సిఫార్సు చేసి చేతులు దులుపుకుంది.

5). ఎపి పునర్విజన చట్టంలోని హామీలను వెంటనే అమలు చేయాలన్న వినతులు పట్టించుకోవడం లేదు.

6). హైదరాబాద్ శ్రీశైలం జాతీయ రహదారిపై అమ్రాబాద్ అటవీ మీదుగా ఎలివేటేడ్ కారిడార్ నిర్మాణం

7). రాష్ట్రంలో వంద శాతం ఇంటింటికీ నల్లా నీటిని అందించేందుకు కేంద్ర ప్రభుత్వం ఆర్థిక సాయం అందించాలి. పది లక్షల కుటుంబాలకు ఇంకా నల్లా నీళ్లు అందటం లేదు. సమీపంలోని నీటి వనరుల ద్వారా గ్రామాలకు రక్షిత మంచినీటిని సరఫరా చేసేందుకు కేంద్రం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జల జీవన్ మిషన్ ద్వారా నిధులు కేటాయించాలి.

8). 10 టిఎంసిల కేశవపురం రిజర్వాయర్ నిర్మాణానికి పొన్నాల గ్రామ సమీపంలోని 1350 ఎకరాల మిలిటరీ డెయిరీ ఫామ్ ల్యాండ్స్ (తోఫెఖానా) రాష్ట్రానికి బదిలీ చేయాలి. లీజు గడువు ముగిసిన శామీర్ పేటలో ఫీల్డ్ ఫైరింగ్ రేంజ్ (1038 ఎకరాల) భూములను తిరిగి అప్పగించాలి.

9). ఐఐటీ, నల్సార్, సెంట్రల్ యూనివర్సిటీతో పాటు ఎన్నో పేరొందిన పరిశోధన, ఉన్నత విద్యా సంస్థలు హైదరాబాద్‌లో ఉన్నాయి. అత్యున్నత విద్యా సంస్థలు అందరికీ అందుబాటులో ఉండాలనే కేంద్ర విధానాలకు అనుగుణంగా హైదరాబాద్‌లో ఐఐఎం (ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్) నెలకొల్పాలి.

10). తెలంగాణలో సెమీ కండక్టర్ల తయారీ పరిశ్రమల ఏర్పాటుకు కేంద్రం సహకారం అందించాలి. ఇప్పటికే ఎలక్ట్రానిక్స్ మ్యానుఫ్యాక్చరింగ్‌లో ప్రధాన పెట్టుబడుల గమ్యస్థానంగా తెలంగాణను తీర్చిదిద్దాలని రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యంగా ఎంచుకుంది.

ట్రేడ్ ఇన్వెస్ట్‌మెంట్ పేరుతో మోసం... ముఠా అరెస్ట్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ట్రేడ్ ఇన్వెస్ట్‌మెంట్ పేరుతో మోసాలకు పాల్పడుతున్న ముగ్గురు సభ్యుల ముఠాను తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో పోలీసులు ఆదివారం హైదరాబాద్‌లో అరెస్టు చేశారు. ఓ బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు.. నిందితులు రూ.23.25 కోట్లు కాజేసినట్లు పోలీసులు గుర్తించారు. ఆ నగదును క్రిప్టోకరెన్సీగా మార్చినట్లు, మనీలాండరింగ్‌కు పాల్పడినట్లు అనుమానిస్తున్నారు. బజాజ్ ఫిన్ సెక్యూరిటీస్ లిమిటెడ్ పేరుతో వాట్సప్ గ్రూప్ ఏర్పాటు చేసి.. మోసాలు చేస్తున్నట్లు నిర్ధరించారు. ప్రధాన నిందితుడు కాంబోడియాలో ఉన్నట్లు గుర్తించారు.

హోంగార్డు వద్ద గంజాయి స్వాధీనం... కేసు నమోదు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హోంగార్డు నుంచి పోలీసులు గంజాయి స్వాధీనం చేసుకున్న ఘటన సంగారెడ్డి జిల్లాలో చోటుచేసుకుంది. సంగారెడ్డి జిల్లా కోర్టులో ఓ అధికారి వద్ద హోంగార్డుగా విధులు నిర్వర్తిస్తున్న కొమ్ముల రాజు శనివారం రాత్రి కందిలో గంజాయి ప్యాకెట్లతో బైక్ వద్ద నిల్చున్నాడు. అదే సమయంలో అక్కడే ఉన్న స్థానికులు రాజును గమనించి అతడి వద్ద గంజాయి ఉన్నట్లు గుర్తించారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు రాజు నుంచి 800 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. దాని విలువ రూ.80వేలు ఉంటుందని పోలీసులు అంచనా వేశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

క్యూబాపై అమెరికా ఆంక్షలు గర్హనీయం

- సామ్రాజ్యవాదానికి ఎదురొడ్డి పోరాడుతున్న ఆ దేశానికి సాయమందించండి
- క్యూబా సంఘీభావ సదస్సులో వక్తల పిలుపు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

"క్యూబాపై అమెరికా ఆంక్షలు గర్హనీయం. ట్రంప్ రెండోసారి అధ్యక్ష పదవి చేపట్టిన తర్వాత ఆ దేశం మరింత దూకుడుగా ఆంక్షలను అమలు చేస్తోంది. లాటిన్ అమెరికా తదితర దేశాలను నయానో భయానో బెదిరించి శాస్త్ర, సాంకేతిక రంగాలతో పాటు నిత్యావసర వస్తువులను కూడా అందకూడా చేస్తోంది. ఫలితంగా క్యూబా నేడు తీవ్ర ఆర్థికంగా సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. సామ్రాజ్యవాదానికి ఎదురొడ్డి పోరాడుతున్న ఆ దేశానికి విరివిగా సాయం అందించాలి" అని వక్తలు పిలుపునిచ్చారు. ఆదివారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో "కన్వెన్షన్ ఇన్ సాలిడారిటి విత్ క్యూబా" అనే పేరుతో నేషనల్ కమిటీ ఫర్ సాలిడారిటీ విత్ క్యూబా తెలంగాణ రాష్ట్ర కమిటీ అధ్వర్యంలో సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బి సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ అమెరికా ఆధిపత్యానికి వ్యతిరేకంగా ఆరు దశాబ్దాలుగా పోరాడుతున్న ఏకైక దేశం క్యూబానేని గుర్తు చేశారు. అగ్రరాజ్య గూఢాచార సంస్థ సిఐఎ క్యూబా విచ్ఛిన్నానికి చేసిన ప్రయత్నాలనన్నింటిని తట్టుకుని నిలిచిందని కొనియాడారు. ప్రపంచ పోరాటాలకు మార్గదర్శకంగా నిలిచిన ఆ దేశానికి యావత్ తెలంగాణ సమాజం అండగా నిలవాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు.

సదస్సులో మాట్లాడుతున్న అరుణ్‌కుమార్

క్యూబాను ఆదుకోవాలి: అరుణ్‌కుమార్

నేషనల్ కమిటీ ఫర్ సాలిడారిటీ విత్ క్యూబా నాయకులు ఆర్ అరుణ్‌కుమార్ మాట్లాడుతూ 1959 విప్లవం తర్వాత దేశంలో సోషలిజం, ఆర్థిక సమానత్వం దిశగా ఫిడరల్ క్యాస్ట్రో నాయకత్వంలో ముందుకు సాగిందని గుర్తు చేశారు. అప్పటి వరకు క్యూబాలో ఉన్న అమెరికా కంపెనీలు ఆ దేశ రైతులు ప్రజల రక్తాన్ని తాగుతున్న నేపథ్యంలో వాటిని జాతీయం చేశారని చెప్పారు. ఈ పరిణామాలను జీర్ణించుకోలేని అమెరికా ఆ దేశంపై అనేక ఆంక్షలు విధించిందన్నారు. ఆరవై ఏండ్లుగా కొనసాగుతున్న ఆంక్షలు ట్రంప్ రెండో సారి అధ్యక్ష పదవి చేపట్టిన తర్వాత వికృత రూపం దాల్చాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రపంచంలో విద్య, వైద్యం లాంటి కనీస వసతులను తరతమ భేదం లేకుండా అందరికి ఉచితంగా అందిస్తున్న ఏకైక దేశం ఒక్క క్యూబా మాత్రమేనని స్పష్టం చేశారు. ప్రపంచానికి అమెరికా ఆయుధాలను, సైనికులను సరఫరా చేస్తుంటే. క్యూబా మాత్రం వైద్యులను సరఫరా చేస్తూ మనుషుల ప్రాణాలను కాపాడుతోందని గుర్తు చేశారు. అలాంటి మానవీయ విలువలు కలిగిన క్యూబా అమెరికా అడ్డగోలు ఆంక్షల వల్ల విద్యుత్, ఆహారం, ఔషద రంగాల్లో తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటుందని అన్నారు. ఈ క్లిష్ట సమయంలో ప్రజలు క్యూబాకు ఇతోధిక సాయం అందించేందుకు ముందుకు రావాలని కోరారు.

రష్యాలో భారత రాయబార కార్యాలయం మాజీ ఉద్యోగి సుధీర్‌బాబు మాట్లాడుతూ క్యూబా విప్లవాన్ని ఆదర్శంగా తీసుకుని ప్రపంచంలోని అనేక దేశాలు విముక్తి పొందాయని అన్నారు. ప్రధాని నెహ్రూ కాలం నుంచి క్యూబాతో భారత దేశానికి బలమైన దౌత్య సంబంధాలు ఉన్నాయని గుర్తు చేశారు. అదే సాంప్రదాయాన్ని కొనసాగించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. తెలంగాణ ప్రెస్ అకాడమి చైర్మన్ కె శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ తాను ఇటీవల క్యూబా పర్యటించిన సందర్భంలో అక్కడి ప్రజల పోరాట స్ఫూర్తి ఎంతగానో ఆకర్శించిందని చెప్పారు. అమెరికా సామ్రాజ్య వాదానికి వ్యతిరేకంగా వందేండ్లయినా పోరాటానికి తాము సిద్ధమని అక్కడి యువత మాటలు ప్రపంచ కమ్యూనిస్టు ఉద్యమానికి మార్గదర్శకమని పేర్కొన్నారు. నేషనల్ కమిటీ ఫర్ సాలిడారిటీ విత్ క్యూబా తెలంగాణ రాష్ట్ర కమిటీ నాయకులు డిజి.నర్సింహరావు అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి, రచయిత యాకుబ్, సీనియర్ జర్నలిస్టు సలీమా వివిద ప్రజాసంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఫాదర్ కొలంబో మెడికల్ కాలేజీ గుర్తింపు రద్దు

- ఈ ఏడాది 150 ఎంబిబిఎస్ సీట్లకు గండి
- అనుమతుల కోసం అడ్డదారులు తొక్కినట్టు ఎన్‌ఎంసి నిర్ధారణ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అనుమతి కోసం అడ్డదారులు తొక్కిన వరంగల్ జిల్లా హంటర్‌రోడ్డులోని ఫాదర్ కొలంబో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (వైద్య కళాశాల) గుర్తింపును జాతీయ వైద్య కమిషన్ (ఎన్‌ఎంసి) రద్దు చేసింది. ఫలితంగా ఈ విద్యా సంవత్సరం అభ్యర్థులు 150 ఎంబిబిఎస్ సీట్లు కోల్పోయే పరిస్థితి నెలకొంది. 2023లో ఫాదర్ కొలంబో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ వైద్యకళాశాల ఏర్పాటుకు ఎన్‌ఎంసి అనుమతి వచ్చింది. మొదటి, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 300 మంది ప్రస్తుతం కళాశాలలో ఎంబిబిఎస్ చదువుతున్నారు. వైద్య కళాశాలలకు ఏటా అనుమతి ఇవ్వడానికి ముందు ఎన్‌ఎంసీ అధికారులు ఆ కళాశాలలో కనీస వసతులు పరిశీలిస్తారు. ఈ కళాశాలను ఎన్‌ఎంసి బృందం పరిశీలించే సమయంలో అధికారులకు మధ్యవర్తుల ద్వారా సంస్థ ట్రస్టీ జోసెఫ్ కొమ్మారెడ్డి రెండు దఫాలుగా రూ.66 లక్షలు చెల్లించినట్లు సిబిఐ కేసు నమోదైన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే ఎన్‌ఎంసి అధికారులు కళాశాల గుర్తింపు రద్దు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం చదువుకుంటున్న విద్యార్థుల బోధనకు ఎలాంటి ఇబ్బంది ఉండదని వైద్యవర్గాలు చెబుతున్నాయి. రాష్ట్రంలో మొత్తం 30 ప్రయివేటు వైద్య కళాశాలలు ఉండగా అందులో రెండు కాలేజీలు డీమ్డ్ యూనివర్సిటీలుగా మారాయి. ఈ కళాశాల గుర్తింపు రద్దుతో మిగిలిన 27 కళాశాలల్లోని సీట్లకు మాత్రమే ఈ ఏడాది కాళోజీ నారాయణరావు ఆరోగ్య విశ్వవిద్యాలయం అడ్మిషన్ల కౌన్సెలింగ్ నిర్వహించనుందని అధికారులు తెలిపారు. కళాశాల యాజమాన్యం మాత్రం తాము ఎన్‌ఎంసీని ఒప్పించి అడ్మిషన్లు కొనసాగించేలా ప్రయత్నిస్తామని చెబుతోంది.

సామాజిక మార్పులో విద్య కీలకం

- డాక్టర్ అచ్యుత సమంట

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సమాజంలో మార్పు రావడంలో విద్య కీలకమని డాక్టర్ అచ్యుత సమంట తెలిపారు. విద్య, సామాజిక మార్పు కోసం ఆయన చేసిన కృషికిగాను రహరలోని రామకృష్ణ మిషన్ వివేకానంద సెంటినరీ కాలేజ్ ఆయనకు లైఫ్‌టైం అచీవ్‌మెంట్ అవార్డును అందజేసింది. ప్రొఫెసర్ సమంత ఆయన సంస్థల ద్వారా 80 వేల మంది పేదలకు ఆహారం, వసతి, అభ్యసన అవకాశాలను అందజేస్తున్నారు. ఈ అవార్డును అణగారిన పేద విద్యార్థులకు అంకితమిస్తున్నట్టు తెలిపారు. అవార్డు గ్రహీతను కిస్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ డెబాసిష్ బందోపాధ్యాయ్, కాలేజీ ప్రిన్సిపాల్ స్వామి కమలాస్థానంద ప్రత్యేకంగా అభినందించారు.

నకిలీ బాబాపై కేసు నమోదు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఓ మహిళపై అసభ్యకరంగా ప్రవర్తించిన నకిలీ బాబా పై కేసు నమోదు చేసినట్లు ఇంద్రవల్లి ఏఎస్ఐ కొండరి రమేష్ తెలిపారు. వివరాల ప్రకారం, ఇంద్రవెల్లి మండలంలోని మెండపల్లి గ్రామానికి చెందిన మహిళ తన కొడుకుకు జ్వరం రావడంతో వారం రోజుల క్రితం అదే గ్రామంలో ఉన్న కోట్నాక్ శంకర్ అనే బాబా వద్దకు వెళ్లింది. జ్వరం కారణం చూడమని అడగగా, "మీ ఇంట్లో మంత్రాలు చేశారు, అవి తీయాలంటే నాతో అక్రమ సంబంధం పెట్టుకోవాలి. అలా చేస్తే పూజలు చేసి మంత్రాలు తొలగిస్తాను" అంటూ బాబా అసభ్యకరంగా ప్రవర్తించాడు. దీంతో బాధిత దంపతులు ఇంద్రవెల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, బాబా కోట్నాక్ శంకర్ పై కేసు నమోదు చేసినట్లు ఎఎస్ఐ రమేష్ తెలిపారు.

'బ్లూ టంగ్' రాకెట్

- గొర్రెలకు ఉచితంగా వేసే వ్యాక్సిన్లను అమ్ముతున్న వైనం
- 'నాట్ ఫర్ సేల్' పట్టించుకోని వెటర్నరీ సిబ్బంది
- ఎపి నుంచి తెలంగాణకు అక్రమ రవాణా
- ఒక బాటిల్ ధర రూ. 600
- ఇరు రాష్ట్రాల అధికారులకు జిఎంపిఎస్ ఫిర్యాదు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో బ్లూ టంగ్ వ్యాక్సిన్ రాకెట్ (నీలి నాలుక) వెలుగు చూసింది. గొర్రెలు, మేకలకు రోగాలు రాకుండా ముందస్తుగా ఈ వ్యాక్సిన్ వేస్తారు. ఉచితంగా అందాల్సిన వ్యాక్సిన్ ప్రస్తుతం బహిరంగ మార్కెట్లో దర్శనమిస్తోంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ప్రయివేటు సంస్థల వద్ద కొని అక్కడ ఉచితంగా పంపిణీ చేస్తోంది. దాన్ని ఎపి నుంచి రహస్యంగా తీసుకొచ్చి తెలంగాణలో ఒక బాటిల్‌కు రూ. 600 చొప్పున అమ్ముతున్నారు. తాజాగా సూర్యాపేట జిల్లాలో ఇది వెలుగులోకి వచ్చింది. బాటిల్‌పై 'నాట్ ఫర్ సేల్' అనే షరతు ఉన్నా... దాన్ని కూడా పశుసంవర్ధక శాఖ సిబ్బంది లెక్క చేయడం లేదు. ప్రయివేటు వ్యక్తులకైతే అడ్డూ అదుపూ లేకుండాపోయింది. అక్కడ ఉచితంగా పంపిణీ చేసినట్టు లెక్కలు చూపించాలంటే, బాటిల్‌ను కూడా జాగ్రత్తగా ఏపీకి అప్పజెప్పాలి. అందుకు అంగీకరించిన కొంత మంది అధికారులు ఈ రాకెట్‌లో పాలు పంచుకుంటున్నారు. ఇండియన్ ఇమ్యూనో లాజికల్స్ లిమిటెడ్ నుంచి 'రక్షాబ్లూ వ్యాక్సిన్' ఏపీ ప్రభుత్వం కొనుగోలు చేసి, ఆ రాష్ట్ర పశుసంవర్ధక శాఖ ద్వారా ఉచితంగా పంపిణీ చేస్తున్నది. అయితే ఈ వ్యాక్సిన్లను ఏపీ పశుసంవర్ధకశాఖ అధికారులు... కొందరు వ్యక్తులతో కలిసి తెలంగాణలోని ప్రయివేటు వెటర్నరీ మెడికల్ షాపుల ద్వారా అక్రమంగా కాపర్లకు విక్రయిస్తున్నట్లు సమాచారం. ఈ క్రమంలో సూర్యాపేట జిల్లాలోని నూతనకల్ మండల కేంద్రం, శిల్పకుంట్ల గ్రామం, అర్వపల్లి మండల కేంద్రంలో బ్లూ టంగ్ వ్యాక్సిన్ నేక్టివేటెడ్ ఐపీ రక్ష-బ్లూ విక్రయాలు జోరుగా సాగుతున్నాయని గుర్తించారు. ఈ విషయాన్ని గమనించిన గొర్రెల కాపర్ల సంఘాలు, వ్యాక్సిన్ బాటిళ్ల బ్యాచ్ నంబర్లను పరిశీలించగా, ఇవి తెలంగాణకు చెందినవి కావనీ, ఏపీ ప్రభుత్వ సరఫరాకు చేస్తున్నదని గుర్తించాయి. ఈ అక్రమ రవాణా వెనుక ఏపీ, తెలంగాణాలోని పశు సంవర్ధక శాఖ సిబ్బంది, ప్రయివేటు వ్యక్తులు కుమ్మక్కైనట్లు గొర్రెల కాపర్ల సంఘాలు ఆరోపిస్తున్నాయి. ఉచితంగా అందించాల్సిన వ్యాక్సిన్లను అమ్ముకుంటున్నారు. ఈ విషయంలో ఔషధ నియంత్రణ శాఖ కూడా చోద్యం చూస్తున్నది. ఈ అక్రమాలను అరికట్టాల్సిన పశు సంవర్ధక, ఔషధ నియంత్రణ శాఖలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని ఆరోపణలున్నాయి. జిల్లా అధికారులకు ఈ విషయం తెలిసినా, ఉన్నతాధికారులకు చెప్పకపోవడం గమనార్హం. మరోవైపు పశుసంవర్ధక శాఖ 2023లో బ్లూ టంగ్ వ్యాక్సిన్ కొనుగోలు చేసి ఉచితంగా పంపిణీ చేసింది. ఆ తర్వాత కాలంలో ఆ విషయాన్ని పట్టించుకోలేదు.దీంతో గొర్రెల కాపర్లు వ్యాక్సిన్లను కొనుగోలు చేయాల్సి వస్తున్నది. రాష్ట్రంలో ప్రతి ఐదువేల పశువులకు ఒక డాక్టర్ ఉండాలి. కానీ 17000 పశువులకు డాక్టర్ మాత్రమే ఉన్నారు. దీంతో పశువుల ఆరోగ్య రక్షణ కూడా లేకుండాపోయింది. 2.49 కోట్ల గొర్రెలు, మేకలు ఉన్నట్టు 2019 లెక్కలు చెబుతున్నాయి. వీటికి రోగాలు సోకితే అంతే సంగతులు. అందుకే ప్రభుత్వాలు బీమా సౌకర్యం కల్పించడం, ముందస్తుగా ఇటి, పిపిఆర్, హెచ్ఎస్, షీపాక్స్ వంటి వ్యాక్సిన్లు, మందులు వేయాలి. కానీ పాలకుల నిర్లక్ష్యం కారణంగా అవేవీ అమలు కావడం లేదు.

గొర్రె కాపర్లకు ఉచిత వ్యాక్సిన్ సౌకర్యం కల్పించాలి
జీఎంపీఎస్ ప్రధాన కార్యదర్శి ఉడుత రవీందర్

గొర్రెలు, మేకలకు ఉచిత వ్యాక్సిన్ సౌకర్యం కల్పించాలి. ఔషధ నియంత్రణ శాఖ అక్రమ రవాణాను అరికట్టాలి. ఈ కుంభకోణంపై రెండు రాష్ట్రాల పశు సంవర్ధక, ఔషధ నియంత్రణ శాఖలు దర్యాప్తు చేపట్టాలి. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి. ప్రయివేటు వ్యక్తులపై నిఘా పెట్టాలి. ఏపీ నుంచి వస్తున్న వ్యాక్సిన్లను నియంత్రించాలి. వ్యాధులు పెరుగుతున్న నేపథ్యంలో గొర్రెల కాపర్లు ఆర్థికంగా నష్టపోతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి నీలినాలుక, నట్టల మందులు ఉచితంగా వేయించాలి.

డీలిమిటేషన్‌పై నాది, సిఎం రేవంత్ రెడ్డిది ఒకటే స్టాండ్

- దక్షిణాది రాష్ట్రాలపై కేంద్రం ఆధిపత్యం తగదు
- జర్నలిజం టాక్ షోలో కెటిఆర్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

పార్లమెంటు నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్)పై తనది, సీఎం రేవంత్ రెడ్డిది ఒకే వైఖరి అని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ తెలిపారు. డీలిమిటేషన్‌పై చెన్నైలో జరిగిన సమావేశంలో తాను, రాష్ట్ర ముఖ్యమంత్రి ఒకటే స్టాండ్‌ను వెల్లడించిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. జనాభా లెక్కల ప్రకారం సీట్ల పంపకం ఉండకూడదనేదే తాము వెల్లడించామని స్పష్టం చేశారు. ఒకవేళ డీలిమిటేషన్ చేయాలనుకుంటే ఎమ్మెల్యేల సంఖ్య పెంచాలనేదే తమ పార్టీ డిమాండ్ అని కేటీఆర్ వివరించారు. ఆదివారం రాజస్థాన్‌లోని జైపూర్‌లో నిర్వహించిన జర్నలిజం టాక్ షోలో కేటీఆర్ మాట్లాడారు. ప్రధానమంత్రి నరేంద్రమోడీ బిగ్ బాస్‌లా కాకుండా బిగ్ బ్రదర్‌లా వ్యవహరించాలని కేటీఆర్ అభిప్రాయపడ్డారు. దక్షిణాది రాష్ట్రాలపై ఆధిపత్యం చెలాయించకూడదని సూచించారు. వలస కార్మికులను తెలంగాణ మాజీ సీఎం కేసీఆర్ సొంత బిడ్డల్లా చూసుకున్నారని కేటీఆర్ గుర్తుచేశారు. 2020-21 కొవిడ్ కాలంలో యూపీ, రాజస్థాన్‌తో పాటు ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన కార్మికులకు ప్రత్యేక రైళ్లు ఏర్పాటుచేసి స్వస్థలాలకు పంపించారని చెప్పారు. దేశంలో ఇలా పంపించిన తొలి ముఖ్యంత్రి కేసీఆర్ అని చెప్పారు.

రాజకీయ ప్రయోజనాల కోసం సమాఖ్య స్ఫూర్తిని దెబ్బతీస్తారా?

బిజెపి రాజకీయ ప్రయోజనాల కోసం సమాఖ్య స్ఫూర్తిని దెబ్బతీస్తున్నదని కెటిఆర్ విమర్శించారు. బీజేపీకి లాభం ఉంటేనే ఏదైనా పని చేస్తుందనీ, తనకు లాభం లేకుండా ఏమీ చేయదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కశ్మీర్‌ను రెండు రాష్ట్రాలుగా మార్చాలని ఎవరైనా అడిగారా? ఎందుకు మార్చారు? అని ఆయన ప్రశ్నించారు. బిగ్‌బాస్‌లాగా చిన్న రాష్ట్రాలు, దక్షిణాది రాష్ట్రాలపై ఆధిపత్యం చేయడం తగదని హితవు పలికారు. దక్షిణాది రాష్ట్రాలు జనాభా నియంత్రణ పాటిస్తే, ఉత్తరాది రాష్ట్రాలు జనాభా నియంత్రణ పాటించలేదని తెలిపారు. జనాభా ప్రాతిపదికన డీలిమిటేషన్ చేస్తే దక్షిణాది రాష్ట్రాలకు తీరని నష్టం జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఉత్తరాది రాష్ట్రాల అజమాయిషీ పెరుగుతుందనీ, దేశం మొత్తాన్ని హిందీ బెల్ట్ లీడ్ చేసే పరిస్థితి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇది భారతదేశానికి ప్రమాదకరమని హెచ్చరించారు. 2014-23 వరకు తాము మోడీకి పూర్తిగా మద్దతు ఇవ్వలేదనీ, అంశాలవారీగానే ఇచ్చామని తెలిపారు. సమాఖ్య దేశంలో రాష్ట్రాలు, దేశం కలిసి వెళ్లాలన్నదే తమ అభిమతమన్నారు. హైదరాబాద్‌లో మంచి వనరులున్నాయనీ, ఎంఎస్ఎంఈ కంపెనీలు అక్కడ పెట్టాలని కోరారు.

తెలుగును రుద్దుతున్నామా? మాపై హిందీ రుద్దడమెందుకు?

తాము ఇతర రాష్ట్రాల వారీపై తెలుగును బలవంతంగా రుద్దుతున్నామా? తమపై బలవంతంగా హిందీని రుద్దడమెందుకు? అని కేటీఆర్ ప్రశ్నించారు. భారతదేశం అంటే భిన్నత్వంలో ఏకత్వం అనీ, అలాంటి దేశంలో హిందీ భాషను అందరు నేర్చుకోవాల్సిందేనని చెప్పడం తగదన్నారు. హిందీ నేర్చుకోవాలా? వద్దా? అనేది వ్యక్తిగతంగా ఎవరికి వారు తీసుకునే నిర్ణయమని కేటీఆర్ అభిప్రాయపడ్డారు. హింది భాష కోసం బడ్జెట్‌లో రూ.50 కోట్లు కేటాయించిన కేంద్రంలోని బీజేపీ సర్కార్ తెలుగు, తదితర భాషల కోసం ఎందుకు కేటాయించలేదని ప్రశ్నించారు. స్వాతంత్ర్యం వచ్చిన ఇన్నేళ్లు రాజ్యభాష లేకుండానే దేశం బాగుందని తెలిపారు. ఇప్పటికిప్పుడు జాతీయ భాష ఏమొచ్చిందని కేటీఆర్ నిలదీశారు.

విలక్షణ నటనకు కోట లాంటి వారు 'కోట'

దాశరథి కృష్ణమాచార్య సాహిత్యం కోటి రత్నాల వీణ

ప్రముఖుల నివాళులు

ప్రజాశక్తి కల్చరల్

విలక్షణ నటనకు కోట శ్రీనివాసరావు పెట్టని కోట లాంటి వారని ప్రముఖులు నివాళులర్పించారు. విఖ్యాత నటుడు కోట శ్రీనివాసరావుకు నివాళి సభ శ్రీ త్యాగరాయ గానసభలోని గుండవరపు హనుమంత రావు కళా వేదికపై గాన సభ నిర్వహణలో శనివారం జరిగింది ప్రముఖ దర్శకుడు రేలంగి నరసింహారావు మాట్లాడుతూ కోట సినిమాలో సహజంగా పాత్ర స్వభావంలోకి ఇమిడి పోయే లక్షణం కల ప్రతిభాశాలి అన్నారు. ఆయన తోటి కళా కారుల పట్ల సహృదయత కలవారని వివరించారు. చిత్ర పరిశ్రమలో దర్శకుడు దాసరి నారాయణరావు గతంలో ఆయనకు ధైర్యం ఇచ్చేవారు. అలాగే కోట నటనకు దూరమైనా ఆయనను చూసి నేర్చుకునే అవకాశం పోయింని అవేదన వ్యక్తం చేశారు. ప్రముఖ నటుడు సుబ్బరాయ శర్మ మాట్లాడుతూ తాను ఎదిగి వచ్చిన నాటక రంగాన్ని విస్మరించని గొప్ప మనసున్న నటుడు కోట అన్నారు. ఆయనలో సృజనాత్మక నటనతో మహా నటులు అమితాబ్ బచ్చన్, రాజ్ కుమార్ వంటి వారి ప్రశంసలు పొందారని చెప్పారు. రంగస్థల సినీ ప్రముఖ నటుడు నిట్టల శ్రీ రామ మూర్తి మాట్లాడుతూ సినీ నటుడుగా ఎదిగినా కోట కు రంగస్థలం అంటే ప్రాణం అని ఆయన నటులు పట్ల చూపే అభిమానం మరువలేనిదని చెప్పారు. గాన సభ అధ్యక్షుడు కళా జనార్ధన మూర్తి మాట్లాడుతూ కోట పేరిట ప్రతి సంవత్సరం నాటక సంఘాల వారు వారం పాటు నాటక ప్రదర్శన చేస్తే గాన సభలోని ఆడిటోరియం ఉచితంగా ఇస్తామని ప్రకటించారు. రచయిత దర్శకుడు హనుమంత రావు, నటుడు మాణిక్ నిర్మాతలు రామ సత్యనారాయణ,వీర శంకర్, నాటక కళాకారులు రాధా కృష్ణ తదితరులు నివాళులర్పించారు.

ప్రజాశక్తి కల్చరల్

దాశరథి కృష్ణమాచార్య సాహిత్యం తెలుగు భాషకు కోటి రత్నాల వీణ అని ప్రముఖులు పేర్కొన్నారు . శ్రీ త్యాగరాయ గానసభ ప్రధాన వేదిక పై ప్రముఖ సాంస్కృతిక సంస్థ కిన్నెర ఆర్ట్స్ థియేటర్స్ నిర్వహణలో డాక్టర్ దాశరథి కష్ణమాచార్య శత జయంతి వేడుకలు సందర్భంగా ప్రముఖ కవి సాహితీ విమర్శకుడు ఆచార్య కసిరెడ్డి వెంకట రెడ్డికి కిన్నెర దాశరథి సాహిత్య పురస్కార ప్రదానోత్సవ సభ జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆంధ్ర ప్రదేశ్ ఉన్నత న్యాయస్థానం న్యాయమూర్తి జస్టిస్ బి కృష్ణ మోహన్ పురస్కారం బహుకరించి మాట్లాడారు. తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేసిన మహా కవులు ఎందరో ఉన్నారు అని దాశరథి సాహిత్యం నిజం నవాబు పై ధిక్కార స్వరం గా మారింది అని చెప్పారు. అధ్యక్షత వహించిన రాష్ట్ర ప్రభుత్వ పూర్వ సలహాదారు డాక్టర్ కె వి రమణ మాట్లాడుతూ కసిరెడ్డి వెంకట రెడ్డి ఆధునిక కాలం వివేకానందుడు అని అభివర్ణించారు. ఆయన దేశభక్తి జాతీయ భావం ప్రశంసనీయం అన్నారు. సీనియర్ జర్నలిస్ట్ ఉడయవర్లు దాశరథి కుమార్తె ఇందిర , రచయిత ప్రభాకర్ లు తమ అభినందన తెలిపారు . కిన్నెర రఘురాం స్వాగతం పలికిన సభకు ముందుగా బాల కామేశ్వర రావు ,డాక్టర్ నాగేశ్వర రావు సురేఖ వివి లక్ష్మీలు దశరధి గీతాలు మధురంగా ఆలపించారు.

గడ్డి బతికింది.. పంట సచ్చింది..

- నకిలీ మందులతో పూర్తిగా ఎండిపోయిన పంట
- కలుపు మందుతో నష్టం, ఆందోళనలో రైతులు
- చోద్యం చూస్తున్న అధికారులు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

కొండ నాలుకకు మందేస్తే ఉన్న నాలుక ఊడినట్టుగా అయ్యింది రైతుల పరిస్థితి. కలుపు నివారణ కోసం చేసిన పిచికారి మందుతో మొక్కజొన్న చేలో గడ్డి బతికింది.. పంట చచ్చిపోయింది. పెరుగుతున్న పెట్టుబడులకు భయపడి రైతులు కలుపు నివారణ కోసం ఫర్టిలైజర్ షాపు నుంచి గడ్డి నివారణ మందులు కొనుగోలు చేసి పిచికారి చేస్తున్నారు. ఫర్టిలైజర్ దుకాణదాయలు చెప్పిన సూచనల మేరకు పిచికారి చేస్తే నివారణ జరగాల్సిన కలుపు మంద వేపుగా పెరిగింది. ఏపుగా పెరగాల్సిన మొక్కజొన్న ఎండిపోయింది. చేతికొచ్చిన పంట ఎండిపోవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నోవా అగ్రి సైన్సెస్ వారి అస్టిస్టిక్స్ మందు తో పాటు నోవా ట్రిబో వారి ఎత్రినో హెర్బిసైడ్ సూచనల మేరకు పిచికారి చేసిన పంట చేలు ఎండిపోవడంతో రైతులు లబోదిబోమంటున్నారు. పంటలను పరిశీలించి కంపెనీల నుంచి నష్టపరిహారం వచ్చేలా చూడాలని రైతులు, రైతు సంఘాలు కోరుతున్నారు.

నాగర్ కర్నూల్ జిల్లా బిజినపల్లి మండలం వట్టెం గ్రామానికి చెందిన మామిళ్ల శ్రీనివాసులు.. తనకున్న రెండున్నర ఎకరాల పొలంలో పత్తి పంట సాగు చేశారు. దూక్కి దున్ని, చదును చేయడం మొదలుకొని ఇప్పటిదాకా ఎకరాకు రూ. 30 వేలు వరకు ఖర్చు చేశారు. అయితే ఇటీవల కురిసిన వర్షాల వల్ల పంట మధ్యలో కలుపు పెరిగింది. కలుపు తీయడానికి కూలీల కొరత, అధికవ్యయం కారణంగా కలుపు నివారణా మందును ఫర్టిలైజర్ షాపులో కొనుక్కొని వచ్చి పిచికారి చేశారు. పిచికారి చేసిన తర్వాత నాలుగు రోజులకు పొలానికి వెళ్లి చూస్తే పంట మొత్తం ఎండిపోయింది. ఇదే గ్రామంలో మరో రైతు.. చాకలి భీమయ్య తనకున్న నాలుగు ఎకరాల్లో మక్క పంటను సాగు చేశారు. ఇతనూ అదే మందును పిచికారి చేశారు. ఇప్పుడు పంట పొలంలో చూస్తే ఒక్క మొక్కజొన్న మొక్క కూడా కనబడటం లేదు. ఇది ఈ ఇద్దరి రైతుల పరిస్థితే కాదు, వట్టెం గ్రామంలోని జయశ్రీ ఫర్టిలైజర్ దుకాణంలో కలుపు నివారణా మందును కొనుగోలు చేసి వాడిన ప్రతి రైతుదీ ఇదే పరిస్థితి.

కలుపు నివారణ కోసం.. ఎకరాకు నాలుగు ప్యాకెట్ల చొప్పున నోవా అగ్రి సైన్సెస్ వారి అస్టిస్టిక్స్ మందులో హెర్బిసైడ్స్ వారి నోవా ట్రీ బో మందును కలిపి మొక్కజొన్న పంటలో రైతులు పిచికారి చేశారు. పిచికారి చేసిన నాలుగు రోజుల తర్వాత పొలంలో ఒక్క మొక్క లేకుండా చనిపోయింది. కాగా, కలుపు నివారణ కోసం ఈ మందును నీటిలో కలిపి చల్లారు. అయితే, ఒక ప్యాకెట్ మందు ధర రూ 2100 కాగా, ఎకరాకు నాలుగు ప్యాకెట్ల చొప్పున మొత్తం సుమారు 8500 ఖర్చు చేసినట్టు రైతులు తెలిపారు. ఇంత ఖర్చు చేసి గడ్డి నివారణ కోసం పిచ్చికారి చేస్తే గడ్డి ఏంపుగా పెరిగి మక్క చేను మాత్రం పూర్తిగా ఎండిపోయింది. గతేడాదిలాగే ఈ ఏడాది పంట వేశామని కానీ, ఎప్పుడు ఇలా జరగలేదని రైతులు చెబుతున్నారు. కళ్ల ముందే పంట మొత్తం ఎండిపోవడం, కుళ్లిపోవడంతో తామెట్లా బతకాలని ఆందోళన వ్యక్తం చేశారు. కంపెనీ యాజమాన్యాలు అధికారులు స్పందించి తమకు నష్టపరిహారాన్ని చెల్లించాలని కోరుతున్నారు.

కంపెనీ వాళ్ల వితండవాదం

మక్క పంట ఎండిన విషయాన్ని రైతులు మందుల కంపెనీ యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లగా.. వారొచ్చి పంటను పరిశీలించారు. తామిచ్చిన మందులు ఎక్కడా ఇటువంటి నష్టాన్ని కలిగించలేదని, ఇక్కడ ఎందుకు ఇలా జరిగిందో చూస్తామని చెప్పారు. మూడు ఎకరాలు నష్టపోతే రైతుకు రూ. 40 వేలు ఇస్తామంటున్నారు. పంట చేతికొస్తే ఎకరాకు సుమారు రూ.80 వేలు దిగుబడి వస్తుందని, నాలుగు ఎకరాల్లో పంట ఎండిపోతే రూ.50 వేలిస్తే ఏ మూలకు సరిపోతాయని రైతులు ఆగ్రహం వక్తం చేశారు.

ఫర్టిలైజర్ షాప్ యాజమానికి అవగాహన లేకపోవడం వల్లే..

ఫర్టిలైజర్ షాప్ నడిపే వారికి మందుల పట్ల అవగాహన లేకపోవడం వల్ల ఇలా జరుగుతుందని రైతు సంఘాలు విమర్శిస్తున్నాయి. ప్రధానంగా ఒకరి పేరు మీద అనుమతులు పొంది మరొకరు దుకాణాలు నడుపుతున్నారు. ఏ తెగులుకు ఏ మందు వాడాలో వారికి అవగాహన ఉండడం లేదు. దాంతో రైతుల పెట్టుబడి పెరగడమే గాక పంటలు పూర్తిగా ఎండిపోయే పరిస్థితి నెలకొంది. అంతేకాదు, పిచికారి మందులపై రైతులకు అవగాహన కల్పించడంలో అధికారులు పూర్తిగా విఫలమవుతున్నారు. ముఖ్యంగా ఏ ఏ మందులు కలిపి వాడాలో, మిశ్రమం ఏ మోతాదులో ఉండాలో అధికారులు రైతులకు అవగాహన కల్పించాలి.

కలుపు మందులతో ప్రమాదం

పెరుగుతున్న పెట్టుబడుల వల్ల రైతులు తక్కువ ఖర్చుతో సాగయ్యే వనరులపై దృష్టి సారిస్తున్నారు. రైతుల బలహీనతలను దృష్టిలో పెట్టుకొని అత్యంత ప్రమాదకరమైన రసాయనిక మందులని షాపు యజమానులు సూచిస్తున్నారు. మొక్కజొన్నలో కలుపు నివారణ కోసం చేపడుతున్న గడ్డి నివారణా చర్యలు సైతం ప్రమాదకరంగానే మారుతున్నాయి. సాధ్యమైనంతవరకు ఇట్లాంటి ప్రమాదకరమైన మందులు వాడకుండా సాగు చేయడానికి రైతులు ప్రయత్నించాలని రైతు సంఘాల నాయకులు, శాస్త్రవేత్తలు కోరుతున్నారు.

మూడో స్థానంలో మొక్కజొన్న సాగు

ఉమ్మడి జిల్లాలో పత్తి, వరి తర్వాత మూడో స్థానంలో మొక్కజొన్న పంట సాగవుతుంది. ఈ ఏడాది ఖరీఫ్‌లో సుమారు ఐదు లక్షల ఎకరాలకు పైగానే మొక్కజొన్న సాగు చేశారు. మొక్కజొన్న సాగు చేసి రెండో పంటగా రబీలో వేరుశెనగ వేయాలన్న ఆలోచనతో రైతులు తక్కువ సమయంలో దిగుబడి వచ్చే మొక్కజొన్న పంటను సాగు చేశారు. ఇంత పెద్ద స్థాయిలో సాగు చేస్తున్నా పంట సాగు సమయంలో తీసుకోవాల్సిన మెలకువల గురించి అధికారులు రైతులకు ఏమాత్రం అవగాహన కల్పించడం లేదు.

పరిశీలించి సహాయం కోసం ప్రభుత్వానికి పంపిస్తాం : డిఎఒ నాగర్ కర్నూల్ జిల్లా

వట్టెం గ్రామంలో రైతుల పంట నష్టం గురించి విచారణ చేస్తాం. ఏ కంపెనీ మందు వాడారు? ఏ మోతాదులో వాడారు? నష్టం ఎలా జరిగిందో సమాచారం తీసుకుంటాం. రైతులకు ఎటువంటి నష్టం రాకుండా న్యాయం జరిగేలా పరిశీలిస్తాం. ముఖ్యంగా రైతులు గడ్డి నివారణా చర్యలు తీసుకునే సమయంలో ఏ కంపెనీ మందు వాడుతున్నారో వ్యవసాయ అధికారులతో సలహాలు, సూచనలు తీసుకోవాలి.